క్లుప్తంగా

అలరించిన సంగీత విభావరి

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని జూబ్లీ క్లబ్ ఫంక్షన్ హాల్‌లో ఫ్రెండ్స్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆదివారం రాత్రి నిర్వహించిన సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్‌కె.అంజద్ భాషా అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో తొలుత సరస్వతీదేవి చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం గాయనీ, గాయకులు ఎస్వీ రమణ, జనార్దన్, ఎండీ జాఫర్, ప్రకాష్, శివలీల, నాగస్వర్ణశ్రీ, కృష్ణశబరి, సింధుబైరవిలు పాడిన పాటలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విద్యుత్, ఉపాధ్యాయ ఉద్యోగ ప్రతినిధులు జి.శ్రీధర్, పారుపల్లి సురేష్, సీహెచ్.నరేష్, స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

కోరట్లగూడెంవాసికి జాతీయ పురస్కారం



గోవిందరావును సన్మానిస్తున్న ప్రతినిధులు

నేలకొండపల్లి: మండలంలోని కోరట్లగూడెం గ్రామానికి చెందిన కణతాల గోవిందరావుకు మహానంది జాతీయ పురస్కారం అందుకున్నారు. వాస్తు రంగంలో విశిష్టమైన సేవలు అందిస్తున్నందుకు తెలుగు వెలుగు జాతీయ పురస్కారాల ప్రదానోత్సవంలో భాగంగా ఆదివారం సన్మాన కార్యక్రమం నిర్వహించగా.. ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామస్తులు అభినందించి ఘనంగా సన్మానించారు.

ఉపాధ్యాయుడికి సాహితీ పురస్కారం



అవార్డు అందుకుంటున్న రఘుకుమార్

కామేపల్లి: ఎంజేపల్లి హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న జిందం రఘుకుమార్‌కు తెలుగు వెలుగు సాహితీ వేదిక స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యాన తెలుగు వెలుగు జాతీయ పురస్కారాన్ని అందజేసింది. హైదరాబాద్‌లోని శ్రీత్యాగరాయ గాన సభ, కళా దీక్షితుల కళా వేదికలో ఆదివారం నిర్వహించిన పురస్కారాల ప్రదానోత్సవంలో క్రాఫ్ట్, స్కాట్ మాస్టర్, వాస్తు జ్యోతిష్య రంగంలో విశేష సేవలు అందించినందుకు గానూ కార్యక్రమ ప్రముఖుల చేతుల మీదుగా ఆయనకు పురస్కారం లభించింది.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ఖమ్మంగాంధీచౌక్: ఉపాధ్యాయ దినోత్సవం, ఇంజనీర్స్ డేలను పురస్కరించుకొని ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం ఆధ్వర్యాన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులను, పలువురు ఇంజనీర్లను సన్మానించారు. లయన్స్ క్లబ్ ప్రతినిధి కొత్త సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులు రేలా విక్రంరెడ్డి, ముత్తాడి దామోదర్‌రెడ్డి, దామళ్ల వెంకటేశం, కొత్తా సత్యనారాయణరెడ్డి, పెద్దపల్లి సుధాకర్, బి.పుల్లారెడ్డి, నీట్‌లో మెడిసిన్ సీటు సాధించిన లయన్స్ క్లబ్ ప్రతినిధి వెంకట్రామిరెడ్డి కుమార్తె రిషితారెడ్డిలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎ.రాఘవరెడ్డి, డాక్టర్ డి.పూర్ణ చందర్‌రావు, డాక్టర్ సత్యనారాయణరెడ్డి, పాయల నాగేశ్వరరావు, బైరెడ్డి పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా

కామేపల్లి: మండల వ్యాప్తంగా ఆదివారం గ్రామాల్లో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యాన స్వచ్ఛతా హీ సేవా–2023 కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక యువతతో కలిసి ప్రభుత్వ కార్యాలయాలు, వీధుల వెంట శ్రమదానం, ప్రతి ఇంటి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించి, శుభ్రం చేయడం వంటి పనులను చేపట్టారు.

ఘనంగా తెలంగాణ వారోత్సవ వేడుకలు



జెండాఎగుర వేస్తున్న నాయకులు

రఘునాథపాలెం: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) ఆధ్వర్యాన తెలంగాణ వారోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని కోయచలక, రఘునాథపాలెం, దొనబండ, వీఆర్‌బంజర, లచ్చిరాం తండా, తదితర గ్రామాల్లో జాతీయ జెండా ఎగుర వేసి నినాదాలు చేశారు.ఉత్సవ కమిటీ సభ్యులు కవిత రమేష్, బ్రహ్మం పాల్గొన్నారు.

శరణు గణేశ...



విక్రయానికి సిద్ధంగా ఉంచిన గణపతి విగ్రహాలు

నేడు వినాయక చవితి

- మండపాల్లో కొలువుదీరిన గణేశుడు
- జోరుగా ప్రతిమలు, పత్రి, పూలు, పండ్లు, సామగ్రి అమ్మకాలు
- 21 రకాల ఆకులతో పూజలు

ఖమ్మంగాంధీచౌక్: పార్వతీ పరమేశ్వరుడి కుమారుడైన వినాయకుడి పుట్టిన రోజు సందర్భంగా నిర్వహించే వినాయక చవితి వేడుకలు నేడు(సోమవారం) నుంచి ప్రారంభం కానున్నాయి. విఘ్నాలు తొలగించే విఘ్నేశ్వరుడిని పూజిస్తే అన్ని కార్యాలు ఫల ప్రదమవుతాయని ప్రజల విశ్వాసం. తొమ్మిది రోజుల పాటు నిర్వహించుకునే ఈ ఉత్సవాలకు మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖ నుంచి అనుమతులు తీసుకొని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. కాగా, ఖమ్మం నగరంలో స్తంభాద్రి ఉత్సవ సమితి మండప నిర్వాహకులకు వారధిగా వ్యవహరిస్తూ సహాయ, సహకారాలను అందిస్తోంది.

వాడవాడన వినాయక మండపాలు..

వినాయక చవితి ఉత్సవాల కోసం యువకులు, విద్యార్థులు, కాలనీ వాసులు కమిటీలుగా ఏర్పడి చందాలను వసూలు చేసుకొని విగ్రహాలను కొంటున్నారు. ఈ నేపథ్యాన కొందరు ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలను ప్రతిష్ఠిస్తుండగా.. మరికొందరు పర్యావరణహితంగా మట్టి విగ్రహాలతో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారు.

జోరుగా పూజా సామగ్రి విక్రయాలు..

వినాయకుడి పూజకు అవసరమయ్యే ప్రతిమలతో పాటు వివిధ రకాల ఆకులు(పత్రి), పాలవెల్లి, పూలు, పలు రకాల కాయలు, పండ్లు, మామిడి తోరణాలు, పూల దండలు విక్రయిస్తున్నారు. నగరంలో ఎక్కడ చూసినా వినాయక ఉత్సవాల సందడే కనబడుతోంది.

పూజా విధానం..

చవితి రోజు ఇంటిని శుభ్రం చేసి మామిడి తోరణాలతో అలంకరించాలి. అనంతరం ఓ పీటకు పసుపు రాసి, బియ్యం పోసిన పళ్లెంలో తమలపాకులు ఉంచి, అగరొత్తులు వెలిగించి, దీపారాధన చేసి మంత్రాన్ని ఉచ్చరిస్తూ పూజను ప్రారంభించాలి. పీటపై వినాయక ప్రతిమను ఉంచి, పాలవెల్లికి పసుపు రాసి కుంకమ బొట్టు పెట్టి విగ్రహంపై వచ్చేలా దాన్ని వేలాడదీయాలి. దానిపై పత్రివేసి నలుమూలల మొక్కజొన్న పొత్తులు, పళ్లతో అలంకరించాలి. ఉండ్రాళ్లు కుడుములు, పాయసం, గారెలు, పులిహోర, మోదకులు, జిల్లేడుకాయలు పెట్టాలి. రాగి పాత్రలో నీళ్లు పోసి కొబ్బరికాయ, జాకెట్టు ఉంచి కలశం ఏర్పాటు చేయాలి. మొత్తంగా గణనాథునికి 21 రకాల ఆకులతో పూజలు చేస్తారు.

ఏకదంతుడి పూజకు వేళాయె..



వినాయక చవితిని పురస్కరించుకొని సోమవారం ఏకదంతుడి ప్రతిమలను ప్రతిష్ఠించి పూజలు చేసేందుకు అవసరమైన భక్తులు ఏర్పాట్లు చేసుకున్నారు. ఈమేరకు వినాయకుడి విగ్రహాలతో పాటు ప్రధాన రహదారి కూడళ్లలో పూజా ద్రవ్యాలు, గరికె, చెరుకు గడలు, అరటి ఆకులు, పండ్లు, పూలు విక్రయాలు చేపట్టడంతో భక్తులు పెద్ద సంఖ్యలో కొనుగోలు చేసి తీసుకెళ్లారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్



పండ్లు, పత్రి కొనుగోలు చేస్తున్న భక్తులు



పూజా ద్రవ్యాలు కొనుగోలు చేస్తూ..

వినాయకుడి విగ్రహాల పంపిణీ..

ఖమ్మంసహకారనగర్/ ఖమ్మంఅర్బన్/ నేలకొండపల్లి: వినాయక చవితిని పురస్కరించుకొని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాలయాలు, పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యాన ఆదివారం గణేశుడి విగ్రహాలను పంపిణీ చేశారు. విగ్రహాల పంపిణీ కార్యక్రమాలను పలువురు ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల బాధ్యులు ప్రారంభించి పంపిణీ చేశారు. పర్యావరణం కు హని కలగకుండా ప్రతీ ఒక్కరూ మట్టి ప్రతిమ లను పూజించాలని కోరారు.



ఖమ్మంఅర్బన్: పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ లక్ష్మీనాగేశ్వరరావు, వాసవీక్లబ్ బాధ్యులు



ఖమ్మంఅర్బన్: బొమ్మ విద్యా సంస్థల ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న మేయర్ పునుకొల్లు నీరజ

గణపతిని దర్శించుకున్న మంత్రి పువ్వాడ

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని శివాలయం సెంటర్‌లో భారీ సెట్టింగ్‌లతో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాన్ని ఆదివారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ దర్శించుకొని పూజలు చేశారు. స్తంభాద్రి ఉత్సవ సమితి ప్రతినిధి డొలే సాయికిరణ్, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ డొలే లక్ష్మీప్రసన్నల ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన మట్టి గణపతి విగ్రహానికి మంత్రి పువ్వాడ పట్టు వస్త్రాలను, గజమాలను సమర్పించారు. ఈ సందర్భంగా పువ్వాడ ఫౌండేషన్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన విత్తన గణపతి ప్రతిమలను మంత్రి పువ్వాడ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, స్థానిక కార్పొరేటర్ మదూరి ప్రసాద్, బీఆర్‌ఎస్ టౌన్ అధ్యక్షుడు పగడాల నాగరాజు, గద్దం త్రిలోక్, కన్నం ప్రసన్న కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న మంత్రి పువ్వాడ, తదితరులు

ప్రశాంతంగా నవరాత్రులు జరుపుకోవాలి

కూసుమంచి/ ఖమ్మంరూరల్/ నేలకొండపల్లి: ప్రశాంతమైనా వాతావరణంలో వినాయక చవితి ఉత్సవాలు జరుపుకోవాలని ఏసీపీ బస్వారెడ్డి , సీఐలు రాజిరెడ్డి, కంది జితేందర్‌రెడ్డిలు సూచించారు. ఆదివారం మండలాల్లోని పోలీస్‌స్టేషన్‌లో ఉత్సవ కమిటీల బాధ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. విగ్రహాలు ఏర్పాటు చేసేవారు అనుమతులు తీసుకోవాలని, మండపాల వద్ద కుల, మతాలను రెచ్చగొట్టే విధంగా చేయరాదని, అల్లర్లు ఏమైనా జరిగితే ఉత్సవ కమిటీ వారే బాధ్యత వహించాలన్నారు. ఎస్సై రమేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ జితేందర్‌రెడ్డి

ఖమ్మంలో భారీ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న నాయకులు

ఖమ్మంఅర్బన్: మాజీ సీఎం చంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసిస్తూ ఖమ్మంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఖమ్మం, మధిర, పాలేరు తదితర నియోజకవర్గాల నుంచి పార్టీలకతీతంగా వచ్చిన నాయకులు పలువురు పాల్గొన్నారు. ఖమ్మంలోని ఎన్‌టీఆర్ సర్కిల్ నుంచి ఇల్లెందు క్రాస్‌రోడ్డు, జెడ్పీ సెంటర్, వైరా రోడ్డు, మయూరిసెంటర్, పెవిలియన్ గ్రౌండ్ వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం పెవిలియన్ గ్రౌండ్ నుంచి ఎన్‌టీఆర్ సర్కిల్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ తీశారు. రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు నల్లమల వెంకటేశ్వరరావు, డీసీసీబీ డైరెక్టర్ తుల్లూరి బ్రహ్మయ్య, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణతో పాటు వివిధ పార్టీల నాయకులు నందమూరి చైతన్యకృష్ణ, మద్దినేని స్వర్ణకుమారి, తాళ్లూరి జీవన్, కేతినేని హరీశ్, నల్లమల రంజిత్, చింతనిప్పు కృష్ణచైతన్య, కూరపాటి వెంకటేశ్వర్లు, కనకమేడల సత్యనారాయణ, మోరంపుడి ప్రసాద్ తదితరులు మాట్లాడారు.

ఎంవీపాలెంను మండల కేంద్రం చేయాలి

ఖమ్మంరూరల్: ఎంవెంకటాయపాలెంను మండల కేంద్రంగాచేయడానికి ఐక్యంగా ఉద్యమించాలని సీపీఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్ అన్నారు. ఆదివారం ఎంవీపాలెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంతమంది పాలకులు వచ్చినా వెనుకబడిన ఎంవీపాలెం పరిసర గ్రామాలు మాత్రం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయని, ఈ విషయంలో పాలకులు స్పందించి ఎంవీపాలెంను మండల కేంద్రంగా ప్రకటించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి నండ్ర ప్రసాద్, ప్రజాపంథా నాయకులు గుర్రం అచ్చయ్య, గ్రామ సర్పంచ్ మందటి సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌కు నివాళి



సైదేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఖమ్మంరాపర్తినగర్: ఇటీవల మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ మంగా సైదేశ్వరరావుకు పోలీస్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, బంధువులు నివాళులర్పించారు. ఆదివారం నగరంలో సైదేశ్వరరావు సంతాపసభను కుటుంబసభ్యులు నిర్వహించగా.. ఏఆర్ ఎస్ఐ వెంకటేశ్వరరావు మాట్లాడారు. సైదేశ్వరరావు శాఖకు మంచి పేరు తీసుకొచ్చేలా పని చేశారని, ఆయన ఆకస్మిక మరణం తీరనిలోటని చెప్పారు. ఈ కార్యక్రమంలో కుటుంబసభ్యులు మంగా చైనత్యసాయి, నాగమణి, హెడ్ కానిస్టేబుల్ రామారావు, ప్రసాద్, వెంకన్న, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పెర జానికి రాములు, డాక్టర్ శీలం పాపారావు, కార్పొరేటర్ కొప్పెర సరిత ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం

కూసుమంచి: మండలంలోని ఎర్రగడ్డతండాలో బానోత్ బుచ్చమ్మ జ్ఞాపకార్థం సంస్కృతి చారిటబల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఆర్. శ్రీనివాసన్ ఆధ్వర్యాన వైద్యులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జర్పుల అనసూర్య, బానోత్ శ్రీనివాస్, రాంకుమార్, హట్టియా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు

ఖమ్మం మామిళ్లగూడెం/నేలకొండపల్లి: శ్రీశ్రీశ్రీ విశ్వకర్మ భగవానుడి జయంతిని పురస్కరించుకొని ఆదివారం మండల కేంద్రాల్లో కోలాటం, డప్పు వాయిద్యాలతో నృత్యాలు చేస్తూ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈనేపథ్యాన ఖమ్మంలోని 58వ డివిజన్ రాపర్తినగర్ బోర్డు నుంచి బీసీకాలనీ వరకు కోలాట బృందంచే శోభాయాత్ర నిర్వహించారు. అలాగే నేలకొండపల్లిలో విశ్వర్మ సంఘం ఆధ్వర్యాన సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో 58 డివిజన్ విశ్వకర్మ ఐక్యవేదిక కమిటీ అధ్యక్షుడు కందుకూరి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సోమనాగరాజుకుమార్, కోశాధికారి మడుపు శ్రీనివాసచారి, ఉపాధ్యక్షుడు శంకర్, సహాయకార్యదర్శి వెంకటాచారి, విశ్వకర్మ మండల కన్వీనర్ తుడిమళ్ల ఉపేంద్రచాకి, మండల కో-కన్వీనర్ తొగాటి నాగచారి, తదితరులు పాల్గొన్నారు.



శోభాయాత్రలో పాల్గొన్న స్థానికులు

‘విజయభేరి’కి తరలిన కాంగ్రెస్ శ్రేణులు



ఖమ్మం సహకారనగర్: జెండా ఊపి వాహనాన్ని ప్రారంభిస్తున్న దుర్గాప్రసాద్

హైదరాబాద్ తుక్కుగూడ రాజీవ్‌గాంధీ ప్రాంగణంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన విజయభేరి సభకు పలు మండలాల నుంచి ఆదివారం కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. తొలుత మండల కేంద్రాల్లో నిర్వహించిన ర్యాలీలను పలువురు ప్రజాప్రతినిధులు పార్టీ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం బాణాసంచాలు కాలుస్తూ.. సంబరాలు చేశారు.

– నేలకొండపల్లి/కామేపల్లి/ఖమ్మంసహకారనగర్

ఆయుర్వేద వైద్యాలయం ప్రారంభం



మొక్క నాటుతున్న ఫౌండేషన్ సభ్యులు

ఖమ్మంరూరల్: మండలంలోని పోలేపల్లిలో గల గురుదక్షిణ ఫౌండేషన్‌లో ఆయుర్వేద వైద్యాలయాన్ని ఆదివారం డాక్టర్ సామినేని రాఘవులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడానికి ప్రాంగణంలో తర్ఫీదునిస్తారని తెలిపారు. ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్.సత్యనారాయణ ప్రసాద్ మాట్లాడుతూ.. రిటైర్డ్ ఉపాధ్యాయులు ఎందరో ఉన్నత ఆశయాలతో ఎన్నో కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని తెలిపారు. అనంతరం ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పారుపల్లి వెంకటేశ్వరరావు, ఎం.సత్యనారాయణ, డాక్టర్ రమణ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లగూడెం బీఆర్‌ఎస్ గ్రామ శాఖ ఎన్నిక

కామేపల్లి: తాళ్లగూడెం బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ శాఖను ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బానోత్ హరిసింగ్‌నాయక్ ఆధ్వర్యాన ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా శెట్టి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా పుచ్చకాయల బాబు, ఎంపీటీసీ ఇన్‌చార్జ్‌గా శెట్టి సంతోషరావు, యూత్ ప్రెసిడెంట్‌గా పుచ్చకాయల ఉదయ్‌కిరణ్ ఎంపికయ్యారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లి ప్రజలను చైతన్యపరచాలని మార్కెట్ చైర్మన్ సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ధనియాకుల హనుమంతరావు, నాయకులు వడియాల క్రిష్ణ రెడ్డి, ముత్యం రామక్రిష్ణ, భట్టు శంకర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

22 మందికి రూ.8.66 లక్షల చెక్కులు..

నేలకొండపల్లి: మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆదివారం మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి పంపిణీ చేశారు. మొత్తం 22 మందికి రూ.8.66 లక్షల విలువైన చెక్కులను అందించారు. అనంతరం మండలంలో పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన, అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ మరికంటి ధనలక్ష్మి, ఎంపీపీ వజ్జా రమ్య, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు గండు సతీష్, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక..

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు గ్రామ పంచాయతీ పరిధిలోని పాపాయిగూడెం గ్రామానికి చెందిన 16 కుటుంబాలు ఆదివారం కూసుమంచి క్యాంపు కార్యాలయంలో పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయా కుటుంబాలకు బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కందాళ

అమరవీరుల స్మృతిలో..

ఘనంగా విలీన, విమోచన, విద్రోహ, సమైక్యత దినోత్సవాలు

తెలంగాణ విమోచన దినోత్సవం, విలీన దినోత్సవం, జాతీయ సమైక్యతా దినోత్సవం ఇలా ఆదివారం వివిధ పార్టీల నేతలు వేడుకలను ఘనంగా నిర్వహించారు. సెప్టెంబర్ 17న చరిత్ర ఒక్కటే అయినా.. స్మరించేది అమరులనే అనే నినాదంతో జై తెలంగాణ.. జైజై తెలంగాణ అంటూ ప్రజాప్రతినిధులు, పలు సంఘాల బాధ్యులు, నాయకులు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఈనేపథ్యాన బీఆర్‌ఎస్ నేతల ఆధ్వర్యాన జాతీయ సమైక్యత దినోత్సవం, బీజేపీ ఆధ్వర్యాన విమోచన దినోత్సవం, సీపీఎం, సీపీఐ, ప్రజాపంథా, న్యూడెమోక్రసీ ఆధ్వర్యాన తెలంగాణ విలీన, విద్రోహ దినోత్సవాలను నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



మంత్రి క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న మేయర్ నీరజ



ఖమ్మంక్రైం: జాతీయ జెండాకు వందనం చేస్తున్న సీపీ విష్ణు ఎస్ వారియర్



నేలకొండపల్లి: జాతీయ జెండాను ఎగురవేస్తున్న బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా రవికుమార్



కామేపల్లి: వివేకానంద సెంటర్‌లో జెండాను ఎగురవేస్తున్న బీజేపీ నాయకులు



ఖమ్మంమయూరిసెంటర్: సీపీఐ జిల్లా కార్యాలయంలో తెలంగాణ విలీన దినోత్సవ వేడుకలు



ఖమ్మంమయూరిసెంటర్: అమరవీరుల స్థూపం వద్ద పాల్గొన్న ఉద్యమకారులు